క్లుప్తంగా

పాఠశాలకు కంప్యూటర్ వితరణ



సదాశివనగర్(ఎల్లారెడ్డి): తిమ్మోజివాడి ప్రాథమికోన్నత పాఠశాలకు మంగళవారం నిజామాబాద్‌కు చెందిన పెరుమాల్ స్వామి అనే న్యాయవాది కంప్యూటర్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా స్వామిని పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో యోసెఫ్, కాంప్లెక్ ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్, ప్రధానోపాధ్యాయుడు రజాక్ పాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని సింధు రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సావిత్రి మంగళవారం తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగిన రెజ్లింగ్ పోటీలలో సింధు అండర్-17 విభాగంలో ప్రథమ బహుమతి సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు.

క్రికెట్ పోటీలకు..



భిక్కనూరు: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి భిక్కనూరు విజ్ఞాన్ పాఠశాలకు చెందిన విద్యార్థి జి.మణిదీప్ మంగళవారం ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలలో మణిదీప్‌ను సన్మానించి అభినందించారు.

అర్చరీ పోటీలకు..



భిక్కనూరు: రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ అర్చరీ పోటీలకు భిక్కనూరు మండల కేంద్రంలోని చైతన్య విద్యానికేతన్‌కు చెందిన విద్యార్థి దండు అఖిల్ ఎంపికయ్యాడు. అండర్-14 విభాగంలో నిజామాబాద్‌లో నిర్వహించిన అర్చరీ పోటీల్లో పాల్గొని జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై య్యాడు. మంగళవారం పాఠశాలలో అఖిల్‌ను సన్మానించి అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ బుర్ల రేణుకుమార్, హెచ్ఎం అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ రక్తదాత పురస్కారం



కామారెడ్డి టౌన్: జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త బాలుకు ఉత్తమ రక్తదాత పురస్కారాన్ని అందజేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాంసింగ్, బాలును శాలువాతో సత్కరించి పురస్కారాన్ని అందజేశారు. బాలు 74సార్లు రక్తదానం చేయడమే కాకుండా వందల సార్లు రక్తదాన శిబిరాలను నిర్వహించి వేలాది మంది ప్రాణాలు కాపాడారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మంగళవారం మండల ప్రత్యేక అధికారి భాస్కరన్ పరిశీలించారు. గ్రామ పంచాయతీ వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనను ఆయన తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులున్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన మైనార్టీ కళాశాల విద్యార్థి

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని మైనార్టీ జూనియర్ కళాశాలలో చదివిన విద్యార్థి అయాన్‌కు నీట్ ద్వారా హైదరాబాద్‌లోని అయాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఇంతియాజ్ అలీ తెలిపారు. మంగళవారం విద్యార్థిని ఘనంగా సత్కరించారు. ఈ యేడాది జరిగిన నీట్ పరీక్షలో 511 మార్కులతో ఎంబీబీఎస్ ఉచిత సీట్ పొందాడాని తెలిపారు.



పిట్లం బ్లూబెల్స్ పాఠశాలలో..



బాన్సువాడ ఉన్నత పాఠశాలలో..



నిజాంసాగర్: బతుకమ్మలతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు



బీబీపేట బాలికల ఉన్నత పాఠశాలలో..



భిక్కనూరు చైతన్య విద్యానికేతన్‌లో ..



బోర్లం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో..

బంగారు బతుకమ్మ ఉయ్యాలో..

జిల్లా వ్యాప్తంగా పలు ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం బతుకమ్మ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా రంగు రంగుల పూల బతుకమ్మలను పేర్చారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలాడారు. అనంతరం స్థానిక చెరువులు, కుంటలలో నిమజ్జనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



మహమ్మద్‌నగర్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు



లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలలో..



బిచ్కుంద కేజీబీవీలో..



భూంపల్లి పాఠశాలలో..



ఎల్లారెడ్డి మోడల్‌స్కూల్‌లో..



దోమకొండలో..



సౌత్‌క్యాంపస్‌లో..



మద్నూర్ ఉన్నత పాఠశాలలో ..



బోర్లం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో..



రాజంపేట: శారద శిశుమందిర్ పాఠశాలలో..



గోపాల్‌పేటలో..



కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



దేవునిపల్లి ఉన్నత పాఠశాలలో..

బెస్ట్ మోటివేటర్ శ్రీకాంత్

లింగంపేట(ఎల్లారెడ్డి): జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో బెస్టు మోటివేటర్ అవార్డును లింగంపేటకు చెందిన బొల్లు శ్రీకాంత్(రెడ్‌క్రాస్ సొసైటీ మండల అధ్యక్షుడు)కు కామారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ డాక్టర్ రాంసింగ్ అందజేశారు. శాలువాతో సన్మానించి, మెమెంటో అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. రక్తదానం చేయడం వల్ల వ్యక్తి బలహీనపడతాడనే అపోహ తప్పన్నారు. క్రమం తప్పకుండా రక్తదానం చేస్తే గుండెపోటు వచ్చే అవకాశాలు తక్కువవుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తూ 15 ఏళ్లుగా వేలాది మందితో రక్తదానం చేయించిన శ్రీకాంత్‌ను అభినందించారు. అలాగే జిల్లాలో అత్యధికంగా రక్తదాన శిబిరాలు నిర్వహించి అందరికి స్ఫూర్తిగా నిలిచారన్నారు.



అవార్డు అందుకుంటున్న బొల్లు శ్రీకాంత్

వరి పంట పరిశీలన



పెద్దకొడప్‌గల్(జుక్కల్): జగన్నాథ్‌పల్లి గ్రామ శివారులో మంగళవారం వ్యవసాయ అధికారి కిషన్ వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన, రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం సోయా ధాన్యాన్ని పరిశీలించారు.

బీకేఎస్ నూతన కార్యవర్గం



రాజంపేట: శివాయిపల్లి గ్రామంలో మంగళవారం భారతీయ కిసాన్ సంఘం(బీకేఎస్) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెల్మ సాయిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కంకణాల రవీందర్, కార్యదర్శిగా పెద్దమ్మల బాలరాజ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బీఆర్ఎస్ పాలనలో రైతులకు అన్యాయం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): బీఆర్ఎస్ పాలనలో రైతులకు అన్యాయం జరిగిందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిబాబా అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రైతుల గురించి బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులకు రుణమాఫీ చేయకుండా మోసం చేసిన బీఆర్ఎస్ పార్టీ, రైతుల పక్షాన ధర్నా చేయడం సరికాదన్నారు. నాయకులు వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సామెల్, షెకావత్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత సాయిబాబా

బీజేపీ సభ్యత్వ నమోదు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): కన్‌కల్ గ్రామంలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి, దుకాణాలు, హోటళ్లలకు తిరుగుతూ సభ్యత్వం చేయించి ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. రాష్ట్ర వర్గ సభ్యుడు మర్రిరాంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాపురెడ్డి, మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేటలో టీఎన్‌జీవో సభ్యత్వం..



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): టీఎన్‌జీవో జిల్లా సంఘం పిలుపు మేరకు నాగిరెడ్డిపేట మండలంలో మంగళవారం ఎల్లారెడ్డి తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో ప్రాథమిక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్, ఎంపీడీవో, వ్యవసాయ శాఖల కార్యాలయాల్లోని ఉద్యోగులకు సభ్యత్వాన్ని అందించారు. టీఎన్‌జీవో ఎల్లారెడ్డి తాలూకా అధ్యక్షుడు మహిపాల్, కార్యదర్శి శరణ్, కోశాధికారి రవీందర్ తదితరులున్నారు.

సంక్షిప్తం

జాబ్‌మేళాకు స్పందన

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ డిగ్రీ కళాశాలలో హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్ బ్యాంక్‌ల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు అనూహ్య స్పందన లభించింది. ఈ మేళాలో 42 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ కే. విజయ్‌కుమార్, అకడమిక్ కో-ఆర్డినేటర్ విశ్వప్రసాద్, పాల్గొన్నారు.

పండుగలకు ప్రత్యేక బస్సులు

బాన్సువాడ: బతుకమ్మ, దసరా పండుగలకు ఆర్టీసీ నుంచి ప్రత్యేక బస్సుల సౌకర్యం కల్పించనున్నట్లు బాన్సువాడ డీఎం సరితాదేవి తెలిపారు. ఈ నెల 1 నుంచి 15 వరకు ప్రధాన రూట్లలో ప్రతీ 15 నిమిషాలకు ఒక బస్సు నడుపనున్నట్లు ఆమె వెల్లడించారు. రిజర్వేషన్లు చేసుకునే అవకాశం కూడా కల్పించనున్నట్లు ఆమె అన్నారు.

పశు వైద్య శిబిరం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎర్రాపహాడ్‌లో మంగళవారం పీవీఎన్ఆర్, పశువైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా పశువైద్యాధికారి రాజేశ్వర్ మాట్లాడారు. పాల ఉత్పత్తిని పెంచడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు తెలిపారు. వైద్యాధికారులు రాంచంద్రారెడ్డి, రమేష్, రవి, కిరణ్, శ్రావిక పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు..

భిక్కనూరు: ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యురాలు దివ్య ఆధ్వర్యంలో పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. ఎంపీడీవో రాజ్‌కిరణ్ రెడ్డి, ఎంపీహెచ్ఈవో వెంకటరమణ, హెల్త్‌అసిస్టెంట్ సతీష్ పాల్గొన్నారు.

పల్లెప్రకృతి వనం పరిశీలన

భిక్కనూరు: మండల కేంద్రంలో మంగళవారం మండల ప్రత్యేకాధికారి రజిత పర్యటించారు. ఈ సందర్భంగా ప్రకృతి వనం, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఎంపీడీవో రాజ్‌కిరణ్ రెడ్డి, ఈవో మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

బీబీపేట, తుజాల్‌పూర్‌లలో ..

బీబీపేట: చిన్నారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని మండల ప్రత్యేక అధికారి సతీష్ యాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు తుజాల్‌పూర్ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్, ఎంపీవో కృష్ణ ఉన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్‌గా మాణిక్యం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్‌గా మాణిక్యం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో విధులు నిర్వర్తించిన రాజేశ్వర శర్మ పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా మాణిక్యం బాధ్యతలు స్వీకరించారు.

కరాటే క్రీడాకారిణికి ట్రాక్ సూట్ అందజేత

భిక్కనూరు: జంగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన కరాటే క్రీడాకారిణి కావేరికి ట్రాక్ సూట్‌ను మాజీ సర్పంచ్ నర్సింలు మంగళవారం బహూకరించారు. కావేరి జిల్లాస్థాయి కరాటే జట్టుకు ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. హెచ్ఎం రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

స్వచ్ఛతా హీ సేవా ముగింపు కార్యక్రమం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మర్కల్ స్టేజీ మహిళా గురుకుల కళాశాలలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శోభారాణి బహుమతులను ప్రదానం చేశారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

బాన్సువాడ: పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ అన్నారు. మంగళవారం బాన్సువాడ మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికుల వల్లే నేడు పట్టణవాసులు ఆరోగ్యంగా ఉంటున్నారని అన్నారు. ఆరోగ్య పరీక్షలు చేసి సమస్యలుంటే హైదరాబాద్‌కు రిఫర్ చేసి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. బస్తీ దవాఖాన వైద్యులు స్వాతి, సైముల్ల, ఆరోగ్య అధికారి దాయనందు, నర్సులు స్వప్న, అంజలి, మమత, నాయకులు ఎజాస్, కిరణ్, అలిమోద్దీన్, తదితరులున్నారు.

షెడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

బాన్సువాడ: బాన్సువాడ మాత శిశు సంరక్షణ ఆస్పత్రిలో కొనసాగుతున్న తాత్కాలిక రేకుల షెడ్డు నిర్మాణ పనులను మంగళవారం మున్సిపల్ చైర్మన్ పరిశీలించారు. ఆస్పత్రికి రోగుల తాకిడి ఎక్కువగా ఉన్నందున వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో ఆస్పత్రి ఆవరణలో రేకుల షెడ్డు నిర్మాణం చేపడుతున్నారు. పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు చైర్మన్ సూచించారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గంగాధర్

చీపురు పట్టిన మున్సిపల్ చైర్‌పర్సన్



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని రాశీ వనంలో మంగళవారం జరిగిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీపురు పట్టి రాశీ వనంలో రోడ్లను శుభ్రం చేశారు. మున్సిపల్ కమిషనర్ సుజాత, సానిటరీ ఎస్సై పర్వేజ్ పాల్గొన్నారు.

ఎల్‌వోసీ చెక్కు అందజేత



ఎల్లారెడ్డి: అన్నాసాగర్ గ్రామానికి చెందిన ఆసియాబేగంకు ఆపరేషన్ నిమిత్తం రెండున్నర లక్షల రూపాయల ఎల్‌వోసీ చెక్కును ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మంగళవారం అందించారు. బాధితురాలి తండ్రికి చెక్కును ఎమ్మెల్యే ఇచ్చారు. సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ ఉషాగౌడ్ తదితరులున్నారు.

గౌరారంలో కబ్జా భూముల పరిశీలన

గాంధారి(ఎల్లారెడ్డి): గౌరారం గ్రామాన్ని మంగళవారం రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సందర్శించారు. ఇరు శాఖల అధికారులు గ్రామస్తులతో కలిసి ఆక్రమణకు గురైన భూములను పరిశీలించారు. ఆక్రమణకు గురైన అటవీ భూములను స్వాధీనం చేసుకోవాలని, అడవిని కాపాడాలని రెండు నెలలుగా గౌరారం గ్రామస్తులు అటవీ శాఖ అధికారులను కోరుతున్న విషయం విదితమే. గ్రామానికి అటవీ శాఖ అధికారులను పిలిపించి వారితో కలిసి అటవీ భూముల్లో సాగు చేసిన పంటలను ధ్వంసం చేసి, పశువులను తోలారు. అటవీ శాఖ అధికారులకు, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాలు ఇచ్చారు. అయినా అటవీ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో గత సోమవారం గ్రామస్తులందరూ హైదరాబాద్‌కు వెళ్లి అరణ్యభవన్‌లో సీసీఎఫ్‌వో గోబ్రియాల్‌ను కలిసి వినతి ప్రతం ఇచ్చారు. స్పందించిన సీసీఎఫ్‌వో రెవెన్యూ, అటవీ శాఖ సంయుక్తంగా సర్వే చేసి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఇరు శాఖల అధికారులు గౌరారం గ్రామానికి వెళ్లి గ్రామస్తులతో సమావేశమై చర్చించారు. సర్వే చేసి సరిహద్దులు ఏర్పాటు చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.



గ్రామస్తులతో సమావేశమైన అధికారులు

ప్రణాళికలు తయారు చేయాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): గాంధీ జయంతి సందర్భంగా బుధవారం గ్రామ సభలు నిర్వహించి గ్రామ పంచాయతీల ప్రణాళికలు తయారు చేయాలని డీఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి సురేందర్ సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 41 జీపీల కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామి పథకంలో భాగంగా గ్రామాల్లో పనులను గుర్తించాలన్నారు. ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, కార్యదర్శి శ్రవణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



దోమకొండ: మండల కేంద్రంలోని సహకార బ్యాంకు వద్ద మంగళవారం బ్యాంకు సిబ్బంది మొక్కలు నాటారు. స్వచ్ఛ భారత్ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రతి సహకార బ్యాంకు వద్ద సింగిల్ విండో కార్యాలయ సిబ్బందితో కలిసి మొక్కలను నాటారు. నాటిన మొక్కలను కాపాడాలని బ్యాంకు మేనేజర్ శృతివాణి ఈ సందర్భంగా అన్నారు. దోమకొండ సింగిల్‌విండో కార్యదర్శి బాల్‌రెడ్డి, ముత్యంపేట సింగిల్ విండో కార్యదర్శి రాంచంద్రం, బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభకు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో, మండల ప్రత్యేకాధికారి



తాడ్వాయిలో మాట్లాడుతున్న ఎంపీడీవో సాజిద్

దోమకొండ: మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం జరిగే గ్రామ సభలకు అన్ని శాఖలకు చెందిన అధికారులు కచ్చితంగా హాజరు కావాలని మండల ప్రత్యేకాధికారి జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్‌లు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. గ్రామసభలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్లాన్(జీపీడీపీ)లో భాగంగా 9 థీమ్స్‌పై ఆయా శాఖల వారీగా చర్చించాలన్నారు. ప్రతి నెలా 1, 11 మరియు 21 తేదీలలో గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంక్‌లను కచ్చితంగా క్లోరినేషన్ చేయాలన్నారు. గ్రామంలో ప్లాస్టిక్ నివారణకై ర్యాలీని నిర్వహించాలని సూచించారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి గుర్తింపు కార్డులు, ఇన్సూరెన్స్ కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఈజీఎస్ ఏపీవో రజని, ఐకేపీ ఏపీఎం రాజు, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభలు విజయవంతం చేయాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఈనెల 2 నుంచి జరిగే గ్రామ సభలను విజయవంతం చేయాలని ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ అన్నారు. తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉపాధి పనులు కూడా సజావుగా నడిచేలా చూడాలన్నారు. ఏపీవో మల్లేష్, సూపరింటెండెంట్ హన్మాండ్లు, కార్యదర్శులు, టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.